సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 16 । జూన్ । 2025



విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లు
పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు ఏటా ఆర్టీసీ ఉచిత బస్ పాస్‌లను జారీ చేస్తోంది. 8లో



డ్వాక్రా గ్రూపుల్లో అవినీతి
వీరవాసరం మండలం నందమూరి గరువులోని డ్వాక్రా గ్రూపుల్లో భారీ అవినీతి చోటుచేసుకుంది. సుమారు రూ.కోటి మేరకు సొమ్ము పక్కదారి పట్టింది. 8లో



కలల వారధి ఇంకెన్నాళ్లు?
గోదావరి కాల్వపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియక ఉంగుటూరు నియోజకవర్గ వాసులు ఆందోళన చెందుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

మున్సిపల్ కార్మికులకు అన్యాయం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాల చెల్లింపులో జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సరిచేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం ఏలూరులో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ నగర కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయంలో ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు మద్దతుగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 12 వేల మంది మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు జీతాల వ్యత్యాసాల వల్ల వందల కోట్ల రూపాయలు నష్టపోతున్నారన్నారు. మున్సిపల్ కార్మికుల రాష్ట్రవ్యాప్త సమ్మెకు సీఐటీయూ అనుబంధ సంఘాలన్నీ మద్దతుగా పాల్గొంటున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అప్పలరాజు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడుతూ జీతాల్లో వ్యత్యాసం వల్ల ఒక్కో కార్మికుడు ఆరేళ్లలో రూ.4.50 లక్షలకు పైగా నష్టపోయారన్నారు. పలు సంఘాల నాయకులు వైఎస్ కనకారావు, జె.గోపి, అంగుళూరు జానుబాబు, వినుకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా యంత్రాంగం అత్యవసర పరిపాలన సంబంధమైన పనులకు హాజరు కావాల్సి ఉన్నందున సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కార్యక్రమాన్ని రద్దు చేశామని ప్రజలు గమనించాలని కోరారు.

నేడు ఏలూరులో పీజీఆర్ఎస్

ఏలూరు(మెట్రో): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లాస్థాయిలో సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్టు డీఆర్వో వి.విశ్వేశ్వరరావు తెలిపారు. కొల్లేరుకు సంబంధించి కేంద్ర సాధికారత కమిటీ పర్యటన దృష్ట్యా కలెక్టర్ సంబంధిత ప్రాంతాల్లో పర్యటిస్తారని, పీజీఆర్ఎస్‌కు జాయింట్ కలెక్టర్ హాజరవుతారని పేర్కొన్నారు. అలాగే సమస్యలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని, 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు.

కొల్లేరు ప్రజల జీవనాన్ని కాపాడాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపాలని, కొల్లేరులో పక్షులు, పర్యావరణాన్ని మాత్రమే కాకుండా అక్కడి ప్రజల జీవితాలను, జీవనాన్ని కాపాడాలని ఈనెల 17,18 తేదీల్లో పర్యటించే కేంద్ర సాధికారత కమిటీని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కొల్లేరును నమ్ముకుని వందలాది ఏళ్లుగా బతుకుతున్న సుమారు మూడు లక్షల మంది ప్రజల జీవనం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కొల్లేరును 3వ కాంటూరుకు కుదించడం, ఎకో సెన్సిటివ్ జోన్ నుంచి మినహాయించడం, వారికి ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా మాత్రమే ప్రజల జీవితాలను నిలబెట్టగలమని తెలిపారు. అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. జిరాయితీ డీ పట్టాల భూములను రైతులకు కేటాయించాలన్నారు. అటవీ నిబంధనలు సడలించి తాగునీరు, రోడ్లు, శ్మశాన వాటికలు, మౌలిక వసతుల అభివృద్ధికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు.

ఉత్కర్ష అభియాన్‌తో గిరిజనుల అభివృద్ధి

ఏలూరు(మెట్రో): దార్తీ అభ జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పథకం జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి దోహదపడుతుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పథకం అమలుపై అధికారులతో సమీక్షించారు. గిరిజన పథకాలను అర్హులు వినియోగించుకునేలా చూడాలన్నారు. పథకాలు, గిరిజనుల హక్కులపై అవగాహన కలిగించేందుకు ఈనెల 16 నుంచి 30 వరకు గిరిజన గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని 132 గిరిజన గ్రామాల్లో గిరిజనుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తహసీల్దార్లు, ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఐటీడీఏ పీఓ రాములు నాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సాగుకు సిద్ధం.. సాయం శూన్యం




ఏలూరు (మెట్రో): ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు కూటమి ప్రభుత్వం ఎలాంటి సాయం అందించడం లేదు. ఆరక చేతబట్టి పొలం బాట పట్టిన రైతులు దిగాలుతో వ్యవసాయ పనులు చేపడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా రైతులకు ఎలాంటి పెట్టుబడి సాయం అందించకుండా వ్యవసాయం దండగ అనే రీతిలోనే వ్యవహరిస్తోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేక అప్పులు చేసి వ్యవసాయ పనులు మొదలు పెడుతున్నామని వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో రైతే రాజుగా..

రాష్ట్రంలో రైతే రాజుగా భావించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నదాతల సంక్షేమానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా సీజన్ ప్రారంభంలోనే ఆర్థిక సాయం అందించారు. ఇలా ఏలూరు జిల్లాలో రైతులకు 2019 నుంచి 2023 వరకు రూ.1,339.45 కోట్ల సాయం అందించారు. అయితే ప్రస్తుత కూటమి సర్కారు ఎన్నికల హామీల్లో భాగంగా రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేల చొప్పున అందించాల్సి ఉండగా.. ఏడాది గడిచినా పట్టించుకోవడం లేదు. తాజాగా ఈనెల 20 నుంచి అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభిస్తామని కూటమి నాయకులు ప్రకటించారు. అయితే ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఎప్పుడు పథకాన్ని అమలు చేసి సాయం అందిస్తారని రైతులు నిట్టూరుస్తున్నారు.

సార్వా సాగేనా..?
- ఖరీఫ్ పనులు ప్రారంభం
- రైతులను పట్టించుకోని ప్రభుత్వం
- అన్నదాత సుఖీభవ సాయం ఎప్పటికో?
- జిల్లాలో 99,512 హెక్టార్లలో సాగు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీజన్ ఆరంభంలోనే సాయం



13,027 మందికి ఈకేవైసీ

జిల్లావ్యాప్తంగా 1,62,085 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా జిల్లా వ్యవసాయశాఖ అధికారులు లెక్కలు తేల్చారు. రైతులకు సంబంధించి ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే ఇప్పటివరకు కేవలం 13,027 మంది రైతుల ఖాతాల ఈకేవైసీ మాత్రమే పూర్తిచేశారు.

రైతుల ఇక్కట్లు

గత ఏడాది కాలంగా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం సాయం చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ నష్టపోతున్నారు. రైతులు సీజన్ ఆరంభంలో పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తే పంట చేతికొచ్చాక కూడా ఆ అప్పు తీర్చే పరిస్థితి ఉండటం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ పనులు చేపడుతున్న రైతులు చేతిలో డబ్బులు లేక మరోమారు అప్పుల కోసం తిప్పలు పడుతున్నారు.

గత ప్రభుత్వంలో రైతు భరోసా సాయం

సంవత్సరం	రైతులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019	2,24,016	302.42
2020	2,13,950	288.83
2021	1,90,729	257.48
2022	1,87,950	253.73
2023	1,98,179	236.99

24 గంటల్లో బాలికల ఆచూకీ లభ్యం

తాడేపల్లిగూడెం రూరల్ : బాలికల మిస్సింగ్ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. కేసు నమోదైన 24 గంటల్లోనే బాలికల ఆచూకీ గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన తాడేపల్లిగూడెంలో చోటుచేసుకుంది. ఆదివారం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో రూరల్ సీఐ రమేష్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండలంలోని ఎల్.అగ్రహారం టిడ్కో గృహ సముదాయానికి చెందిన ఓ మహిళ ఈనెల 12న రాత్రి నుంచి తన కుమార్తె, ఇంటి ఎదురుగా ఉన్న మరో బాలిక కనిపించడం లేదంటూ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై 13న రూరల్ ఎస్సై జేవీఎస్ ప్రసాద్ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డీఎస్పీ డి.విశ్వనాథ్ పర్యవేక్షణలో రూరల్ సీఐ రమేష్, టౌన్ సీఐ ఆదిప్రసాద్, రూరల్ ఎస్సై ప్రసాద్, పెంటపాడు ఎస్సై స్వామిలతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సీసీ కెమెరా ఫుటేజ్, బాలికల ఫోన్ కాల్ డేటా, వారి స్నేహితుల కాల్ రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించగా బాలికలు చెన్నైలో ఉన్నట్టు గుర్తించారు. ప్రత్యేక బృందాల సాయంతో వారిని తాడేపల్లిగూడెం క్షేమంగా తీసుకువచ్చారు. ప్రాథమిక దర్యాప్తులో బాలికలు స్నాప్‌చాట్ ద్వారా యువకులతో సంభాషించేవారని, చెన్నై వెళ్లి పనిచేసుకుంటూ పెళ్లి చేసుకోవాలని వీరు భావించినట్టు తెలిసిందన్నారు. బాధితుల వాంగ్మూలం ఆధారంగా కేసు దర్యాప్తు కొనసాగుతుందని సీఐ రమేష్ తెలిపారు. పిల్లలను సెల్‌ఫోన్లు వీలైనంత దూరంగా ఉంచాలని, లేదంటే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కేసును 24 గంటల్లోనే ఛేదించిన రూరల్ సీఐ రమేష్, టౌన్ సీఐ ఆదిప్రసాద్, ఎస్సైలు జేవీఎస్ ప్రసాద్, స్వామి, సిబ్బందిని జిల్లా ఎస్పీ నయీమ్ అస్మి అభినందించారు. సమావేశంలో టౌన్ సీఐ ఆదిప్రసాద్, ఎస్సైలు జేవీఎస్ ప్రసాద్, కేసీహెచ్ స్వామి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ రమేష్. చిత్రంలో టౌన్ సీఐ ఆదిప్రసాద్

కొల్లేరులో సీఈసీ అధ్యయనం

నేడు కొల్లేరు గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

కైకలూరు : కొల్లేరు అభయారణ్య ఆక్రమణలు, పర్యావరణానికి విఘాతం, ప్రజల ఇబ్బందులు, జిరాయితీ, డీఫాం భూముల అంశాలపై సుప్రీం కోర్టులో పిటీషన్ల నేపథ్యంలో ఈనెల 17, 18 తేదీల్లో కేంద్ర సాధికారత కమిటీ (సీఈసీ) పర్యటించనుంది. సీఈసీ కమిటీ సభ్యులు జి.భానుమతి, చంద్ర ప్రకాష్ గోయల్, సునీల్ లిమాయే, డాక్టర్ జైవర్ధన్ రమన్‌లాల్ భట్‌లు కొల్లేరు ప్రాంతాల్లో అధ్యయనం చేయడానికి విచ్చేస్తున్నారు. సోమవారం ఢిల్లీ నుంచి రానున్న బృందం ముందుగా విజయవాడలో సీఎం చంద్రబాబుతో భేటీ కానున్నారు. సీఈసీ పర్యటన నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు అన్ని దస్త్రాలను సిద్ధం చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో అప్రమత్తమయ్యారు.



ర్యూట్ మ్యాప్ నిమిత్తం సమావేశం

సీఈసీ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ వెట్రిసెల్వి సోమవారం కొల్లేరు ప్రాంతాలను పరిశీలించనున్నారు. సీఈసీకి అందించే నివేదికలపై అటవీ శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. కైకలూరు రెవెన్యూ కార్యాలయంలో రూట్ మ్యాప్ నిమిత్తం సమావేశం నిర్వహించనున్నారు. ఈనెల 17న మండవల్లి మండలం, 18న కైకలూరు మండలంలో సీఈసీ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. కొల్లేరు నాయకులు కైకలూరు మండలం పందిరిపల్లిగూడెం వద్ద బహిరంగ సభ, అలాగే నిడమర్రు మండలం తోకలపల్లి, భైనేపల్లి, ఆకివీడు మండలం సిద్దాపురం ప్రాంతాల్లో కొల్లేరును పరిశీలించాలని అధికారుల ద్వారా సీఈసీకి తెలియజేయడానికి సిద్ధమయ్యారు.

వినతులు సిద్ధం

కొల్లేరులో 122 పరీవాహక గ్రామాలు ఉండగా.. మౌలిక వసతులు, శ్మశానాలకు భూములు, తాగునీటి చెరువులు, మట్టి పూడికలు వంటి అంశాలను సీఈసీకి వినతుల రూపంలో అందించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. కొల్లేరు అభయారణ్యం 77,135 ఎకరాల్లో జిరాయితీ, డీఫాం పట్టా భూములు దాదాపు 20 వేల ఎకరాలు మినహాయించాలనే ప్రధాన డిమాండ్‌ను సీఈసీ ముందు ఉంచనున్నారు. అటవీ నిబంధనలు కఠినంగా ఉన్నాయని, వాటిని సవరించి ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్పు చేయాలని కోరనున్నారు.

కమిటీ సభ్యులు వీరే..

జి.భానుమతి



సీఈసీకి సభ్య సెక్రటరీగా జి.భానుమతి వ్యవహరించనున్నారు. ఆమె త్రిపుర కేడర్‌కు చెందిన 2009 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి. ప్రస్తుతం న్యూఢిల్లీలో నేషనల్ టైగర్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అథారిటీ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫారెస్ట్‌గా పనిచేస్తున్నారు.

రమన్‌లాల్ భట్



డాక్టర్ జైవర్ధన్ రమన్‌లాల్ భట్ అంతర్జాతీయ పర్యావరణ నిపుణులు. 35 ఏళ్లుగా పర్యావరణ శాస్త్రీయ సాంకేతిక సేవలు అందిస్తున్నారు. పలు సంస్థలకు సలహాదారులుగా ఉన్నారు. పర్యావరణంపై 20 పుస్తకాలు రాశారు. 10 అంతర్జాతీయ సమావేశాలకు సంధానకర్తగా వ్యవహరించారు.

సునీల్ లిమాయే



మహారాష్ట్ర కేడర్‌కు చెందిన సునీల్ లిమాయే ఇండియన్ ఫారెస్టు సర్వీస్ ఆఫీసర్. చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుగా పనిచేశారు. ఏకో టూరిజం మేనేజింగ్ డైరెక్టర్, మహారాష్ట్ర సంజయ్ గాంధీ నేషనల్ పార్కు డైరెక్టర్‌గా ఉన్నారు. చిరుత పులుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

చంద్రప్రకాష్ గోయల్



చంద్రప్రకాష్ గోయల్ ఐటీ అధికారి. 1986లో ఐఎఫ్ఎస్‌లో చేరారు. ఉత్తరప్రదేశ్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుగా పనిచేశారు. కేంద్ర అటవీ, వాతావరణ మార్పుల శాఖ స్పెషల్ సెక్రటరీగా విధులు నిర్వహించారు. పర్యావరణ అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి సలహాదారుగా ఉన్నారు.

కాలువలకు జలకళ

భీమవరం అర్బన్: మండలంలోని కాళీపట్నం చానల్, వెంప చానల్, అనాకోడేరు పంట కాలువ, ఎల్‌జీ పాడు చానల్‌కు నీరొచ్చింది. నందమూరు అక్విడెక్ట్ నుంచి కాలువలకు నీరు విడుదల చేయడంతో ఆయా కాలువల్లో జలకళ సంతరించుకుంది. ఏప్రిల్‌లో కాలువలు బంద్ చేయడంతో గ్రామాల్లో రక్షిత మంచినీటి చెరువులు అడుగంటాయి. మరలా కాలువలకు నీరు రావడంతో తమకు సాగునీటి ఇబ్బందులు ఉండవని రైతులు అంటున్నారు. తొలకరి వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు.



ఎల్‌జీపాడు చానల్‌లో నీరు

నారాయణపురం వంతెనకు భారీ రంధ్రం

- శ్లాబ్ ఊడి పడిన వైనం
- స్తంభించిన రాకపోకలు
- గత ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు
- కూటమి పాలనలో పట్టించుకోని వైనం

ఉంగుటూరు: ప్రజలు అనుకున్నదంతా జరిగింది. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో వంతెన శ్లాబ్ ఊడి పెద్ద రంధ్రం పడింది. ఆదివారం వేకువజామున మండలంలోని నారాయణపురం బ్రిడ్జిపై మీటరున్నర పొడవు, మీటరు వెడల్పున శ్లాబ్ ఊడి పెద్ద రంధ్రం పడింది. ఆ సమయంలో వాహన రాకపోకలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. బ్రిడ్జిపై ద్విచక్రవాహనాలు మినహా మరి ఏ ఇతర వాహనాలు తిరగకుండా పోలీసులు, ఆర్అండ్‌బీ సిబ్బంది ఆంక్షలు విధించి పహారా కాస్తున్నారు. గణపవరం సీఐ సుభాష్, చేబ్రోలు, నిడమర్రు ఎస్సైలు సూర్యభగవాన్, ప్రసాద్ ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆర్అండ్‌బీ ఏఈ భాస్కరరావు ఈ ప్రదేశాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించారు. ఉన్నతాధికారులు ఎవరూ ఇప్పటివరకూ ఇక్కడకు రాలేదు.

భారీ వాహనాల రాకపోకలతోనే..

1932లో నారాయణపురం బ్రిడ్జిని నిర్మించగా దాదాపు 12 ఏళ్ల నుంచి శిథిలావస్థకు చేరుకుంది. ఇటుగా 30 టన్నుల వరకు భారీ వాహనాలు ఎక్కువగా తిరగడమే బ్రిడ్జికి రంధ్రం పడటానికి కారణంగా కనిపిస్తుంది. నిత్యం వందలాదిగా చేపలు, రొయ్యలు, కంకర లారీలు ఇటుగా తిరుగుతున్నాయి. కొన్నేళ్లుగా బ్రిడ్జి కింద భాగం పెచ్చులూడటంతో వంతెన పునర్నిర్మించాలని స్థానికులు ప్రజాప్రతినిధులకు విన్నవించారు.



నారాయణపురం బ్రిడ్జికి పడిన రంధ్రం



వంతెనపై పహారా కాస్తున్న పోలీసులు

తప్పని దూరాభారం

పశ్చిమ డెల్టాతో పాటు కోనసీమ జిల్లా నుంచి విజయవాడ, హైదరాబాద్‌కు ఇటుగా దగ్గర మార్గం కావడంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే ఆక్వా ఉత్పత్తుల లోడు లారీలు ఇటుగా కోల్‌కతా, ఈశాన్య రాష్ట్రాలకు వెళుతుంటాయి. ఇప్పుడు ఇటుగా రాకపోకలు నిలిపివేయడంతో కొన్ని వాహనాలు చేబ్రోలు బ్రిడ్జి నుంచి పుంత దారి మీదుగా గణపవరం చేరుకుంటున్నాయి. ఎక్కువ వాహనాలు తాడేపల్లిగూడెం మీదుగా సుమారు 50 మీటర్లు ఎక్కువ దూరం ప్రయాణించి వెళుతున్నాయి.

గత ప్రభుత్వంలో రూ.8.50 కోట్ల మంజూరు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2022లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గణపవరం పర్యటనకు వచ్చిన సందర్భంగా అప్పటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నియోజకవర్గ సమస్యలను విన్నవించారు. దీంతో 2023లో గుండుగొలను, నారాయణపురం, గణపవరంలో వంతెనల నిర్మాణాలకు మాజీ సీఎం జగన్ నిధులు మంజూరు చేశారు. నారాయణపురం బ్రిడ్జికి రూ.8.50 కోట్లు, గుండుగొలను బ్రిడ్జికి రూ.9 కోట్లు, గణపవరం బ్రిడ్జికి రూ.8.45 కోట్ల నిధులు మంజూరు చేశారు. గుండుగొలనులో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే నారాయణపురం బ్రిడ్జి పనులు టెండర్ల ప్రక్రియ దశకు చేరే సరికి సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు నిలిచిపోయాయి. గతేడాది రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పనులను పట్టించుకోలేదు. దీంతో బ్రిడ్జి నిర్మాణం ప్రశ్నార్థకమైంది.

గత ప్రభుత్వంలో బ్రిడ్జి మంజూరు



తాము అధికారంలో ఉండగా అప్పటి సీఎం జగన్‌కు చెప్పి ఉంగుటూరు నియోజకవర్గంలో మూడు బ్రిడ్జిలు మంజూరు చేయించాను. అందులో నారాయణపురం బ్రిడ్జి ప్రధానమైంది. రూ.8.50 కోట్ల నిధులు మంజూరు చేయించగా ప్రభుత్వ అధికారుల తాత్సారం, టెండర్ల దశలో ఉండగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం మారడంతో ఆ పని పెండింగ్‌లో పడింది. బ్రిడ్జికి రంధ్రం పడటం దురదృష్టకరం. వంతెన పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి.

– పుప్పాల వాసుబాబు, మాజీ ఎమ్మెల్యే, ఉంగుటూరు

వృద్ధులకు బాసటగా నిలవాలి



సూచనలిస్తున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ రత్నప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వృద్ధులకు ప్రతిఒక్కరూ బాసటగా నిలవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. ఆదివారం ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో వృద్ధుల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ వృద్ధులపై వేధింపులు, నిర్లక్ష్యం, దుర్వినియోగం వంటి సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలను సూచించడానికి ఈ దినోత్సవం వేదికన్నారు. పిల్లలు వారి తల్లిదండ్రులకు రక్షణ, పోషణ, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధుల సమస్యలను పరిష్కారానికి ప్రతి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ప్రత్యేక ట్రిబ్యునల్ ఉందన్నారు. అవసరమైన పక్షంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థను నేరుగా గాని లేదా 15100 లేదా 08812 224555 ద్వారా సంప్రదించి సాయం పొందవచ్చన్నారు. న్యాయవాది రత్నప్రసాద్, ప్రేమాలయం నిర్వాహకులు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలల వారధి ఇంకెన్నాళ్లు?

- గుండుగొలను వంతెన పనుల్లో జాప్యంపై అసంతృప్తి
- కూటమి పాలనలో ముందుకు సాగని నిర్మాణం


గుండుగొలను వద్ద వంతెనకు శ్లాబ్ వేసిన దృశ్యం


బెయిలీ బ్రిడ్జిపై రాకపోకలు

భీమడోలు: గోదావరి కాల్వపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణం ఎప్పటికి పూర్తి అవుతుందో తెలియక నియోజకవర్గ వాసులు ఆందోళన చెందుతున్నారు. నిర్మాణం చేపట్టి రెండేళ్లు గడిచింది. వైఎస్సార్‌సీపీ హయాంలో పనులు పరుగు పెట్టగా.. కూటమి పాలనలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇటీవల వంతెన శ్లాబ్ వేసినా నేటికి మిగిలిన పనులు జరగకపోవడంతో ప్రజలు కూటమి పాలనపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రెండున్నరేళ్ల క్రితం జాతీయ రహదారికి అనుసంధానంగా గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై నిర్మించిన బ్రిటిష్ కాలం నాటి వంతెన కూలిపోయింది. దీంతో భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్, కైకలూరు ప్రాంతాలకు చెందిన వేలాది మంది ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వేరే ప్రాంతాలకు వెళ్లేందుకు రాకపోకలు స్తంభించాయి. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అప్పటి ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సీఎం హోదాలో గణపవరం వచ్చిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం స్పందించిన జగనన్న గుండుగొలను, నారాయణపురం వద్ద కొత్త వంతెనల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. శాశ్వత వంతెన నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.3 కోట్లు మంజూరు చేశారు. ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నయంగా గుండుగొలను వద్ద కాల్వపై బెయిలీ బ్రిడ్జిని నిర్మించేందుకు రూ.40 లక్షలు మంజూరు చేయించారు. వంతెన నిర్మాణం నేపథ్యంలో కేంద్ర జలరవాణాశాఖ నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాకుండా, వంతెన నిర్మాణంలో తన వంతు కృషి చేశారు. దీంతో 60శాతానికి పైగా పనులు పూర్తి చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సరైన విధానాలను పాటించకపోవడం, వారి మధ్య సమన్వయం కరువవడంతో నిర్మాణం చిక్కుముడిలా మారింది.

జల రవాణ శాఖ అభ్యంతరం

11 మీటర్ల ఎత్తులో వంతెన నిర్మించాల్సి ఉన్నా 5 మీటర్ల ఎత్తు ఉండడంతో కేంద్ర జల రవాణా శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. భవిష్యత్తులో కాల్వలో జల రవాణ జరిగే అవకాశం ఉందని, స్టీమర్లు, పడవలు, ఓడల రవాణాకు ఈ వంతెన అడ్డంకిగా మారుతుందని పేర్కొంది. తక్షణం నిలిపివేయాలని ఆ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఏలూరు ఎంపీ, ఎమ్మెల్యేలు ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదిస్తున్నారు. సమస్య కొలిక్కి రాకపోవడం ఆందోళనకు గురి చేస్తుంది.

బెయిలీ వంతెనపై భయం భయంగా

గుండుగొలను వద్ద శాశ్వత వంతెన నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. ఆ వంతెన నిర్మాణం పూర్తి అయ్యేంత వరకు గోదావరి కాల్వపై బెయిలీ వంతెనను నిర్మించి ప్రజల రాకపోకల కష్టాలకు చెక్ పెట్టారు. ఈ వంతెన వ్యవధి రెండేళ్లని ఆర్ అండ్ బీ అధికారులు ప్రారంభోత్సవం సమయంలో తెలిపారు. ఈ ఏడాది నవంబర్‌కు గడువు ముగుస్తుంది. ఈ వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో బిక్కు బిక్కుమంటూ ప్రయాణం చేయాల్సి ఉంది. దీంతో వంతెన ప్రమాదంగా మారింది.

వంతెన తక్షణం నిర్మించాలి



గుండుగొలను వంతెన నిర్మాణం చేపట్టి రెండేళ్లు గడుస్తుంది. నేటికీ పూర్తి కాలేదు. నిర్మాణానికి రూ.3 కోట్లు, బెయిలీ వంతెన నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేయించాం. దీంతో పనులు సాగుతున్నాయి. కూటమి పాలనలో వంతెన నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులు తీసుకు రావాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉంది. పాలకులు, అధికారుల మధ్య సమన్వయం కొరవడంతో ఈ వంతెన నిర్మాణ పనులు జాప్యమవుతున్నాయి. దీంతో కొల్లేరు వాసులు అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటికే పూర్తి కావాల్సిన వంతెన అవాంతరాల మధ్య జరుగుతుంది. నారాయణపురం వంతెన కూలిపోతుంది. అప్పట్లో నారాయణపురం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాను. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాలకులు పట్టించుకుంటే ఈ వంతెన నిర్మాణం పూర్తయ్యేది. **పుప్పాల వాసుబాబు, మాజీ ఎమ్మెల్యే, ఉంగుటూరు**

క్లుప్తంగా

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉదయానికే ఆలయానికి చేరుకుకోవడంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. పుట్టలో పాలు పోసేందుకు, పాల పొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసేందుకు అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. స్వామిని దర్శించుకున్న అనంతరం నాగబంధాల వద్ద పూజలు చేశారు. అదే విధంగా గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ శ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ మాట్లాడుతూ ఆలయ ఆవరణలో వాహనాల పార్కింగ్ రుసుము వసూలు చేసుకునేందుకు లైసెన్సు హక్కు ఒక సంవత్సర కాలానికి కల్పించేందుకు ఈనెల 17న టెండర్ కం బహిరంగ వేలం జరుగుతుందని తెలిపారు.

ఆటో చోరీపై ఫిర్యాదు

భీమవరం: భీమవరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి రాయలంలోని ఇంటి ముందు నిలుపుదల చేసిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని సీఐ జి. కాళీచరణ్ తెలిపారు. ఈ నెల 11న నిలుపుదల చేసిన ఆటోను యజమాని వై.తాతారావు 12న ఉదయం చూసే సరికి లేకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. కనిపించకపోవడంతో ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం


పారిజాతగిరిలో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరిలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నల్లూరు రవికుమార్ ఆచార్యులు కల్యాణ తంతును జరిపించారు. భక్తులు విశేష సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వీక్షించి తరించారు. ఏర్పాట్లను ఈవో మాణికల రాంబాబు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ


దేవస్థానం వద్ద భక్తుల రద్దీ


కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి

కైకలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మ నీ చల్లని దీవెనలు అందించమ్మా అంటూ భక్తులు అమ్మవారిని ఆర్తితో వేడుకున్నారు. కొల్లేటి కోట పెద్దింట్లమ్మను సమీప జిల్లాల ప్రజలు ఆదివారం దర్శించుకున్నారు. పవిత్ర కోనేరులో స్నానాలాచరించి అమ్మవారికి వేడి నైవేద్యాలను సమర్పించారు. మహిళలు పొంగళ్లను అమ్మకు అందించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఆదివారం ఒక్కరోజు ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండన, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డూ ప్రసాదం, గదుల అద్దెలు, అమ్మవారి చిత్రపటాల అమ్మకం, వాహన పూజల ద్వారా రూ.73,090 ఆదాయం వచ్చిందని తెలిపారు.

విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లు

- ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసిన ఆర్టీసీ
- 12 ఏళ్లలోపు బాలురు, 18 ఏళ్ల బాలికలకు ఉచిత పాసులు
- 2024–2025 ఏడాది జిల్లాలో 1390 ఉచిత పాసుల జారీ



భీమవరం(ప్రకాశం చౌక్): స్కూలు, కళాశాలకు విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు ఆర్టీసీ ఏటా ఉచితంగా బస్సు పాసులిస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా ఈ పాసులు మంజూరు చేస్తోంది. 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు వీటిని ఇస్తారు. విద్యా సంవత్సరం మొదలు కావడంతో ఈ నెల 13 నుంచి ఉచిత బస్‌పాస్‌లు పశ్చిమ ఆర్టీసీ జారీ చేస్తోంది. భీమవరం, తణుకు, నర్సాపురం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు ఆర్టీసీ బస్టాండ్‌ల్లో పాస్‌ల జారీ చేయడానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఉచిత బస్‌పాస్‌లతో పాటు రాయితీ, దివ్యాంగుల(పీహెచ్) పాస్‌లు కూడా జారీ చేస్తున్నారు. విద్యార్థులు విద్యార్థి ఫొటో, స్కూల్ యాజమాన్యం నుంచి (బోనఫైడ్ సర్టిఫికెట్) ధ్రువీకరణ పత్రం సమర్పించి బస్ పాస్ పొందవచ్చును. ఆర్టీసీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని కౌంటర్ దగ్గరకు వెళ్తే వెంటనే ఉచిత పాస్ పొందవచ్చు. పాస్ పొందిన విద్యార్థులు తమ ఇంటి నుంచి 20 కిలోమీటర్ల దూరం వరకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చు. 2024–25 ఏడాదికి జిల్లాలో నాలుగు డిపోల పరిధిలో మొత్తం 13,190 ఉచిత బస్ పాస్‌లు అందిస్తున్నారు.

రాయితీ పాస్‌లు ఇలా

రాయితీ బస్ పాస్ పొందేవారికి పాస్ ధరతో నెలవారీ గుర్తింపు కార్డు రూ.50, సర్వీస్ చార్జీ రూ.40 అదనంగా చెల్లించాలి. రాయితీతోపాటు సంవత్సరం గుర్తింపు కార్డు కోసం రూ.100 చెల్లించాలి. పాస్‌లు నెల, మూడు నెలలు, ఏడాది కాల పరిమితితో మంజూరు చేస్తారు. గడువు ముగిశాక రెన్యువల్ కోసం ప్రిన్సిపాల్ సంతకం చేయించుకుని తిరిగి పొందాలి. సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి ఏప్రిల్ వరకూ, ఐటీఐ, పారా మెడికల్ వంటి కోర్సులు చదివే వారికి మే నెల వరకు పాసులు మంజూరుచేస్తారు.

దివ్యాంగులకు ఉచిత పాసులు

ఆర్టీసీ దివ్యాంగులకు ఉచిత పాసులు అందిస్తుంది. పాస్ పొందడానికి సర్టిఫికెట్, ఆధార్ కార్డు, అన్ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్ సమర్పించాలి. మూడేళ్ల కాల వ్యవధితో ఈ పాస్‌లు జారీ చేస్తారు.

గత రెండేళ్లుగా బస్ పాస్‌ల జారీ ఇలా..

ఏడాది	డిపో	ఉచిత పాస్‌లు	రాయితీ పాస్‌లు	పీహెచ్‌సీ పాస్‌లు
2023–24	భీమవరం	6,056	10,966	319
	నర్సాపురం	2,239	6,367	513
	తణుకు	1,266	4,705	347
	తాడేపల్లిగూడెం	2,142	6,122	506
2024–25	భీమవరం	5,010	4,924	410
	నర్సాపురం	2,512	4,518	358
	తణుకు	2,108	3,661	363
	తాడేపల్లిగూడెం	3,560	3,839	376

అన్ని బస్టాండ్లలో ప్రత్యేక కౌంటర్లు



కళాశాలలు, స్కూళ్లు ప్రారంభమైన నేపథ్యంలో కొత్త బస్ పాస్‌ల జారీకి చర్యలు తీసుకున్నాం. ఈనెల 13 నుంచి పాస్‌లు మంజూరు చేస్తున్నాం. కొత్తవి మంజూరు, పాత పాస్‌లు రెన్యువల్ చేసి విద్యార్థులకు వేగంగా అందించడానికి జిల్లాలోని ఐదు బస్టాండ్‌ల్లో కౌంటర్లు ఏర్పాటు చేశాం. రద్దీ బట్టి అదనపు కౌంటర్లు ఏర్పాటు చేస్తాం.

ఎన్‌వీఆర్ వరప్రసాదరావు జిల్లా ప్రజా రవాణా అధికారి

చిన్నతిరుపతి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు


శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: చిన్నతిరుపతి క్షేత్రంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు ఈనెల 11తో ముగిశాయి. అయితే మంచి తిథులు లేకపోవడంతో విద్యార్థులను తమ తల్లిదండ్రులు సోమవారం నుంచి పాఠశాలలకు పంపేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఆఖరి సెలవురోజును పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. దాంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, కల్యాణకట్ట ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిసాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి.

నీట్ ఫలితాలలో శశి వైజాగ్ విద్యార్థుల ప్రతిభ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నీట్–యూజీ 2025 జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష ఫలితాలలో శశి వైజాగ్ క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు మరోసారి తమ ప్రతిభ చాటారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ తెలిపారు. వివిధ కేటగిరిలలో కాయల జస్వంత్ 285వ ర్యాంకు, రాచమళ్ల ప్రతిభ 535వ ర్యాంకు, కే.యోగేంద్ర బాలాజీ 868వ ర్యాంకు, ఎల్.రేష్మ ఆలిండియా 1152వ ర్యాంకు, ఆర్ఎం సాయికుమారి ఆలిండియా 1436వ ర్యాంకు, జే.స్వర్ణరేఖ ఆలిండియా 2217వ ర్యాంకు, వై.సుభాష్ ఆలిండియా 2436వ ర్యాంకు సాధించారని తెలిపారు. కోచింగ్ తీసుకున్న 80 మందిలో 40 మందికి అనగా ప్రతి ఇద్దరిలో ఒకరికి మెడికల్ సీటు వచ్చే అవకాశం ఉందని, 5000లోపు 10 ర్యాంకులు, 10,000 లోపు 17 ర్యాంకులు, 20,000 లోపు 20 ర్యాంకులు, 40,000 లోపు 45 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ ర్యాంకులు విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని శశి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ ప్రత్యేకంగా అభినందించారు.

వ్యక్తిపై కొడవలితో దాడి

తణుకు అర్బన్: పొలంలో తగాదా కొడవలితో దాడికి దారితీసిన ఘటన తణుకు మండలం దువ్వలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మైపాల నాగేశ్వరరావు తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా.. అదే గ్రామానికి చెందిన కైకాల రమేష్ దమ్ము ట్రాక్టరుపై తన పొలంలో నుంచి రావడంతో నాగేశ్వరరావు ప్రశ్నించాడు. ఈ క్రమంలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఇంతలో రమేష్ సోదరుడు కైకాల వినాయక్ కొడవలితో దాడికి దిగగా నాగేశ్వరరావు చేతికి తీవ్రగాయమైంది. బాధితుడిని తణుకు ఆస్పత్రికి తరలించారు. నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు


గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గుబ్బల మంగమ్మ గుడి వద్ద ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి, సర్పంచ్ కోర్సా గంగరాజు తెలిపారు. గుబ్బల మంగమ్మ గుడి పరిసర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పూర్తి ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. భక్తులు తప్పనిసరిగా పేపర్ బ్యాగ్‌లను తెచ్చుకోవాలని ఆలయ కమిటీ వారు కోరారు.

డ్వాక్రా గ్రూపుల్లో అవినీతి


నందమూరుగరువులో విచారణ చేస్తున్న విచారణ బృందాలు

వీరవాసరం: వీరవాసరం మండలం నందమూరి గరువులో డ్వాక్రా గ్రూపుల్లో భారీ అవినీతి చోటుచేసుకుంది. సుమారుగా రూ.కోటి మేరకు డ్వాక్రా సభ్యుల సొమ్ము పక్కదారి పట్టింది. నందమూరు గరువులో 68 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. నందమూరి గరువు గ్రామ సంఘం వీవోఏగా ముక్కు సత్యవాణి అలియాస్ బోడపాటి సత్యవాణి 2021లో, ఆదర్శ నందమూరి గరువు సంఘం వీవోఏగా పోతుల నాగ స్వాతి 2022లో చేశారు. గత మూడు సంవత్సరాలుగా డ్వాక్రా గ్రూపు సభ్యుల అనుమతి లేకుండా పొదుపు ఖాతాల నుంచి డబ్బులు గ్రామ సంఘం అకౌంట్‌కు బదిలీ చేస్తున్నారు. గ్రామ సంఘం ఖాతా నుంచి స్త్రీ నిధి ద్వారా డ్వాక్రా సంఘ సభ్యులకు సంబంధం లేని వ్యక్తులు ఖాతాల్లోకి నిధులను తరలించారు. సత్యవాణి సుమారు రూ.39,14,700 పక్కదారి పట్టించగా.. పోతుల నాగస్వాతి రూ.43.63 లక్షలు పక్కదారి పట్టించింది.

ఇది గమనించి ప్రభ గ్రూపు సభ్యులు ఏపీఎం జ్యోతి రాణి దృష్టికి, గ్రామంలోని నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఏపీఎం అప్రమత్తమై రికార్డులను పరిశీలించడంతో సుమారు రూ.85 లక్షల మేర అవినీతి చోటుచేసుకుందని గుర్తించారు. ఇదే విషయాన్ని జిల్లా స్థాయి అధికారులకు నివేదించారు. 68 స్వయం సహాయక సంఘాల్లోని రికార్డులను పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు.

సత్యవాణి సుమారు రూ.18 లక్షల నగదును తిరిగి ఆయా డ్వాక్రా సంఘ గ్రూపు నిధులకు జమ చేయించారు. గత మూడేళ్ల నుంచి ఇంత పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుంటే కనీసం పట్టించుకోలేదని సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు సిబ్బంది ఏం చేస్తున్నారంటూ డ్వాక్రా మహిళలు నిలదీస్తున్నారు. దీనిపై ఏపీఎం జ్యోతి రాణి స్పందిస్తూ.. ఇద్దరు వీవోఏల పరిధిలో సుమారు రూ.85 లక్షల మేర అవినీతి చోటు జరిగిందని.. సత్యవాణి నుంచి రూ.18 లక్షల మేర నగదును తిరిగి జమ చేయించామని చెప్పారు. పరారీలో పోతుల నాగస్వాతిపై వీరవాసరం పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సొమ్మును రికవరీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మృతదేహంతో రెండో రోజూ ఆందోళన


కొంతేరులో మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

యలమంచిలి: కొంతేరులో ఆత్మహత్య చేసుకున్న చింతా లక్ష్మీ నర్సమాంబ మృతదేహంతో రెండో రోజు కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేశారు. ప్రేమలో విఫలమై కొడుకు చనిపోవడం, ప్రియురాలి తండ్రి కోర్టులో కేసు వేయడంతో మనస్తాపానికి గురై నర్సమాంబ శనివారం ఉరి వేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆమె మృతదేహంతో ప్రియురాలి ఇంటి ముందు ఆందోళన చేశారు. శనివారం రాత్రి పోలీసులు వచ్చి కుటుంబ సభ్యులు, బంధువులకు నచ్చచెప్పి మృతదేహాన్ని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఆదివారం పోస్టు మార్టం పూర్తి చేసి తిరిగి కొంతేరు తీసుకొచ్చి కుటుంబ సభ్యులు, బంధువులకు అప్పగించారు. మరోసారి మృతదేహంతో ఆందోళన దిగారు. ఆందోళన పెరిగి ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం కనిపించడంతో గ్రామ పెద్దలు, పోలీసులు స్పందించారు. ప్రియురాలి తండ్రిపై కేసు నమోదు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించి, మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

అందని ద్రాక్షగా హజ్ యాత్ర


ఎండీ.జక్కీ, వైఎస్సార్‌సీపీ నేత

ఆకివీడు: హజ్ యాత్రను కూటమి ప్రభుత్వం అందని ద్రాక్షగా మార్చివేసిందని వైఎస్సార్‌సీపీ ముస్లిం విభాగం నాయకులు ఎండీ. జక్కీ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హజ్ యాత్రకు రూ.లక్ష ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మోసగించిందన్నారు. రాష్ట్రంలోని ముస్లింలందరూ హజ్ యాత్రకు వెళ్లవచ్చని ఆశపడ్డారని వారి ఆశల్ని నిరాశ చేశారని ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సాధించిన విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను కూడా కూటమి ప్రభుత్వం రద్దు చేయించిందన్నారు.

క్లుప్తంగా

వికసిత్ భారత్ ప్రతిజ్ఞ



వికసిత్ భారత్ ప్రతిజ్ఞ చేస్తున్న నేతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నరేంద్ర మోదీ పరిపాలన 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం వికసిత్ భారత్ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. నియోజక కన్వీనర్ ఈతకోట తాతాజీ, దొంతుకుర్తి శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నేటి వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, గరగ ప్రసాద్, కసిరెడ్డి నాగ దుర్గ, సామినేని వెంకట రంగారావు, యర్నాల సూరిబాబు, గోకా మహాలక్ష్మి, సన్నిధి లక్ష్మీ దుర్గ, ఈమ్మండి శ్రీను, బండి శ్రీను, కంచర్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన హోమం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామివారికి ఆదివారం శాంతి కల్యాణం నిర్వహించారు. మిథున సంక్రమణం పురస్కరించుకుని శ్రీవారికి సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. ఏర్పాట్లను ధర్మకర్త మంతెన రామ్‌కుమార్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు పర్యవేక్షించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సైబర్ నేరాలపై అవగాహన



కాళ్లకూరులో అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

కాళ్ల: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కాళ్ల ఎస్సై ఎస్. శ్రీనివాసరావు అన్నారు. కాళ్ళకూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రామస్తులకు దొంగతనాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మవద్దన్నారు. స్మార్ట్ ఫోన్లలో తెలియని యాప్, మెసెజ్‌ల లింక్‌లపై టచ్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడ్డాల శివరామరాజు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్ క్రీడామైదానంలో యోగాంధ్ర

భీమవరం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్, డీఎన్నార్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ రోజూ ఒక అరగంట యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరకంగా బలపడి దైనందిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనవచ్చని కళాశాల అసిస్టెంట్ సెక్రటరీ ఆర్.రామకృష్ణంరాజు అన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.పల్లారావు, కార్యదర్శి పి.సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరంలో వికసిత్ భారత్

వీరవాసరం: స్థానిక లిటిల్ బడ్స్ స్కూల్లో ఆదివారం వికసిత్ భారత్ కార్యక్రమం, మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా బీజేపీ అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి రవి కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, మోడీ పాలనలో దేశం సాధించిన అభివృద్ధి గురించి కార్యకర్తలకు లబ్ధిదారులకు వివరించారు.

వృద్ధులను వేధించవద్దు

పెనుమంట్ర: ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది వృద్ధులు తమ కుటుంబ సభ్యుల నుంచి వేధింపులకు గురవుతూ దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని అలాంటి వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పెనుమంట్ర మండల సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల జగన్నాధరెడ్డి విజ్ఞప్తి చేసారు. ఆదివారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణా దినోత్సవాన్ని రోటరీ భవనంలో నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు కర్రి సత్యనారయణరెడ్డి, కార్యదర్శి చిర్ల నరశింహారెడ్డి, జనరల్ సెక్రటరీ పోలపర్తి కృష్ణారావు, రిటైర్డు ఎస్సై కోనాల నర్సిరెడ్డి, మానవతా చైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

రాధ జీవితం మహిళలకు ఆదర్శం

పెనుగొండ: ఐద్వా మహిళా సంఘం నాయకురాలు కరుటూరి రాధ జీవితం మహిళలకు ఆదర్శనీయమని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేతా పద్మ, పొగాకు పూర్ణ అన్నారు. ఐద్వా సంఘ మహిళా నాయకురాలు కరుటూరి రాధ (85)కు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. చరమాంకం వరకూ అనేక ఉద్యమాల్లో పాల్గొని అంకిత భావంతో పనిచేసిన నిజమైన కమ్యూనిస్టు నాయకురాలని కొనియాడారు.

తల్లికి వందనం.. గందరగోళం

- పథకానికి అనేక చిక్కులు
- అయోమయంలో లబ్ధిదారులు



తాడేపల్లిగూడెం: పట్టణంలో వేయి చదరపు అడుగులు దాటి నిర్మించిన భవనం ఉందా. మీకు విద్యుత్ వాడకం సరాసరి నెలకు 300 యూనిట్లు ఉందా. ఇంకేం ఇలాంటి కారణాలు చాలు, మీకు రావాల్సిన పథకం లబ్దిని అటకెక్కించేస్తారు. కనిపించిన ప్రతి బిడ్డను నీకు 15 వేలు, నీకు 15 వేలు అని బీరాలు పోయారు. కోతలు ఉండవు, ఖాతాల్లో సొమ్ము వేతలే అన్నట్టు బిల్డప్‌లు ఇచ్చారు. 365 రోజులు ఆగి, విద్యార్థులు వేల మంది ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ఒక ఏడాది తల్లితండ్రుల కష్టార్జితాన్ని విద్యా సంస్థలకు ఫీజులుగా అర్పించిన తరువాత కూటమి పాలనకు ఏడాది పూర్తయ్యాక తల్లికి వందనం ప్రకటించారు. ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా, అందరికి తలో రూ.15 వేలు అని, వీటిలో రెండు వేల రూపాయలు పాఠశాలలు, కళాశాలల నిర్వాహణకంటూ కోత వేశారు. గత ప్రభుత్వం మాదిరి బటన్ నొక్కిన లబ్ధిదారుల ఫోన్లు బీప్ శబ్దం చేయలేదు. సంక్షిప్త సమాచారం రాలేదు. అదే రోజు చాలా మంది తల్లుల ఖాతాల్లో సొమ్ములు పడలేదు. విద్యాశాఖాధికారులు బదిలీల హడావుడిలో ఉన్నారు. లబ్దిదారుల జాబితాలు సచివాలయాల్లో దర్శనమిచ్చాయి. అర్హులు చాలా మంది పేర్లు ఆ జాబితాలో లేక బేల ముఖం వేయడం లబ్దిదారుల వంతు అయింది. డ్వాక్రా సంఘాల రీసోర్సు పర్సన్ల రా గ్రూపుల్లో మెసేజ్‌ల పరంపరలు. మీకు టచ్ ఫోన్ ఉందా, ఈ యాప్ డౌన్‌లోడు చేసుకోండి, మీ ఆధార్ నంబర్‌తో అనుసంధానమైన ఫోన్‌లో సమాచారం చూసుకోండి. అది లేకపోతే, కటాఫ్ తేదీలు ఇవీ, మళ్లీ చూసుకోండి. అంటూ జూన్‌లో పథకం ప్రకటించినా, జులైలో కటాఫ్ తేదీలంటూ హడావుడి చేస్తున్నారు. పథకం అమలులో పాలకుల్లో చిత్తశుద్ధి కొరవడినట్టుగా క్షేత్రస్థాయి పరిస్థితులు కనబడుతున్నాయి. ఎలాంటి నిబంధనలు లేకుండా అల్పాదాయం, పేదరికం ప్రామాణికంగా పథకాన్ని అమలు చేయాలనే డిమాండ్ పెరిగింది. అర్హుల జాబితాలు, వివరాలు తప్పుల తడకగా ఉన్నాయనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

గతంలో పండుగలా..

జనవరి వచ్చిందంటే వారికి సంక్రాంతికంటే ముందు అమ్మఒడి పండుగ. తేదీ చెప్పడం, బటన్‌నొక్కడం, సొమ్ములు ఖాతాలకు రావడం, విద్యార్థుల కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరియడం ఇలా సాగేది. ఈ పథకం కింద గడిచిన ఐదేళ్లలో గూడెం నియోజకవర్గంలో 46480 మంది విద్యార్థులకు సుమారు 50 కోట్ల రూపాయల ప్రయోజనం కలిగింది. మధ్య తరగతి, బీపీఎల్ కుటుంబాల బిడ్డల చదువు విషయంలో గుబులు లేకుండా గుండెలపై చేయి వేసుకొని హాయిగా పడుకొనే వారు. చదువు భారం అయ్యింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు అధ్వానంగా తయారయ్యాయి. ప్రైవేట్ పాఠశాలల హవా పెరిగింది. ఒక మాదిరి పేరున్న విద్యా సంస్థలో ఎల్‌కేజీ సీటు రూ.50 వేలు ఉందంటే వారి దందా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అదే కాస్త డాంబికాలు ప్రదర్శించే కార్పొరేట్ స్కూల్ అయితే అక్షరాలా లక్ష ఎల్‌కేజీకి కట్టాల్సిందే. తల్లికి వందనం పథకంలో గందరగోళం తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు

తణుకు అర్బన్: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉన్నతాధికారులతో కమిటీల నియామకంచేసి, ప్రత్యేకకోర్టును ఏర్పాటు చేయాలని అందుకు తగిన నిధులు కేటాయించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఆదివారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో నిర్వహించిన అసోసియేషన్ పశ్చిమ గోదావరి జిల్లా సమావేశానికి తిరుపతిరావు అధ్యక్షత వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీవీ నాయుడు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి వై.నాగలక్ష్మి, ఎస్.రామశ్రీను, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్ క్లబ్‌చే నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఆరా ఫౌండేషన్ చైర్మన్, యోగా గురువు కరిబండి రామకృష్ణ కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో జనతా ట్రస్ట్ డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో క్లబ్ అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఆదివారం ట్రస్ట్ ఆవరణలో నిడదవోలు రాజరాజేశ్వరీ రామకృష్ణన్ ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 87 మందికి వైద్య పరీక్షలు చేశారు. 20 మందికి కళ్లజోళ్లు అందించేందుకు నిర్ణయించారు. ఆపరేషన్ల నిమిత్తం 14 మందిని నిడదవోలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రత్యేక ట్రీట్మెంట్ కోసం 9 మంది పేషెంట్లను గుర్తించారు. అవగాహన కార్యక్రమంలో కరిబండి రామకృష్ణ మాట్లాడుతూ కన్ను విలువైన జ్ఞానేంద్రియమని, ఆరోగ్యవంతంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. బీపీ, షుగర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జోన్ చైర్మన్ సుంకర శ్రీనివాస్, కార్యదర్శి చిన్నం జగదీష్, మదన్‌మోహన్ అగర్వాల్, పచ్చవెంకటేశ్వరరావు, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, చిన్నం మునీంద్ర, త్రిమూర్తులు, నున్న రాంబాబు, మూర్తి, యర్రా ఆంజనేయస్వామి, సంపత్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి తీరుతో ప్రజల్లో అసంతృప్తి



మాజీ మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న భీమవరం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వెంకటరాయుడు

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వ తీరుతో ప్రజలు విసిగిపోయారని, ఇచ్చిన హామీలు అమలు చేయక పోగా నిలదీసిన వారిపై దాడులు, అక్రమ కేసులతో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. భీమవరం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా ఇటీవల నియమితులైన చినిమిల్లి వెంకటరాయుడు ఆదివారం తణుకులోని కారుమూరి నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ చినిమిల్లి వెంకటరాయుడు సేవా దృక్పథంతో పని చేసే వ్యక్తిగా అందరికీ సుపరిచితుడన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతలను వెంకటరాయుడు నూటికి నూరు శాతం పూర్తి చేయగలరన్నారు. కార్యక్రమంలో భీమవరం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గాజుల ప్రసాద్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

పలువురికి కారుమూరి పరామర్శ

అత్తిలి: వైఎస్సార్‌సీపీ దివ్యాంగ విభాగం పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు బుడితి సుజన్‌కుమార్ మాతృమూర్తి బుడితి ప్రమీల ఇటీవల మృతి చెందడంతో అత్తిలిలో వారి కుటుంబాన్ని, పాలూరులో వైఎస్సార్‌సీపీ నేత విప్పర్తి చిట్టిబాబు తండ్రి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను కారుమూరి పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న అత్తిలికి చెందిన సర్పంచ్ గంటా విజేత, వైఎస్సార్‌సీపీ నాయకుడు దిరిశాల నాగబాబును పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు, పట్టణ అధ్యక్షుడు సూకపెయ్యి రామకృష్ణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సబ్బితి రాజేష్, గంటా నాగరాజు, మాజీ సర్పంచ్ తేలి సుందరరావు, సోషల్ మీడియా కో-కన్వీనర్ బొండాడ ప్రవీణ్, డాక్టర్స్ వింగ్ జిల్లా కార్యదర్శి ఇల్లూరి సంపదరావు, కట్టా అప్పన్న, ఇంజే రమేష్, నాయకులు దాసి సురేష్, పొట్ల నరేష్, చెల్లూరి పవన్ పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ పిల్లలదే



మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి

తణుకు అర్బన్: వృద్ధాప్యంలో ఉన్న తల్లితండ్రులను వారసులు గౌరవ భావం, ప్రేమాభిమానంతో చూడాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం సందర్భంగా సంధ్యా జ్యోతి వృద్ధాశ్రమంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ముఖ్యంగా వృద్ధుల ఆస్తులు తీసుకొని వారిని నిర్లక్ష్యం చేయకూడదని స్పష్టం చేశారు. పిల్లలకు పెద్దల పట్ల గౌరవ భావంతో మెలిగేలా తెలియజేయాలన్నారు. ముసలి తల్లిదండ్రులకు వారి కుటుంబ సభ్యుల నుంచి ఏదైనా ఆస్తి తగాదా, కుటుంబ సమస్యలు ఉంటే మండల న్యాయ సేవల కమిటీ తణుకు ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి రంజిత్ కుమార్, బార్ అసోసియేషన్ కార్యదర్శి చోడే గోపికృష్ణ, న్యాయవాదులు కొరు వెంకటేశ్వర్లు, పోణంగి శ్రావణి సమీరా, ఎ.అజయ్ కుమార్, ఆశ్రమ ఫౌండర్ డి.రాధమ్మ, ఆశ్రమ ఇన్‌చార్జి రవి, పద్మావతి, కరుణాకర చౌదరి పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

భీమవరం: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని ప్రముఖ పారిశ్రామిక వేత్త సంజీవ్ సోని అన్నారు. భీమవరం ఎస్ సీహెచ్ బీఆర్ఎం హైస్కూల్లో జరుగుతున్న రోప్ స్కిప్పింగ్, మల్లఖంబ్, కరాటే, రైఫిల్ షూటింగ్ వంటి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. శిక్షణ పొందిన 40 మందికి ప్రశంసాపత్రాలను అందించారు. సంజీవ్ సోని మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా కాకుండా విద్యార్థులు వారికి నచ్చిన అంశాలలో శిక్షణ పొంది మానసిక, శారీరక పరిపక్వతకు పునాదులు వేసుకోవడం గొప్ప విషయమని అన్నారు. ఏపీ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ రాష్ట్ర సభ్యుడు జీపీసీ శేఖర్ రాజు, కరాటే హోల్డర్, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, పూర్ణిమ సోని, పి.రామభద్రిరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా మానవాళికి సంజీవని



యోగాసనాలు వేస్తున్న యోగా గురువు శ్రీనివాసరెడ్డి, సీఐ కొండయ్య, ఎస్సైలు

తణుకు అర్బన్: నేటి సమాజంలో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొని మనుగడ సాధిస్తున్న మానవాళికి యోగ సాధన సంజీవనిగా పని చేస్తుందని తణుకు పట్టణ సీఐ ఎస్.కొండయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా డే సందర్భంగా ఆదివారం తణుకులోని మెడికల్ హాలులో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంచి ఆరోగ్యం సిద్ధించాలంటే నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ అద్నాన్ అస్మి, తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు. యోగా గురువు కర్రి శ్రీనివాసరెడ్డి యోగాను అందరికీ ఉచితంగా అందించడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో యోగాసనాలు, ప్రాణాయామం ఆచరించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ మానస, పట్టణ ఎస్సై శ్రీనివాస్, ఇరగవరం ఎస్సై జానా సతీష్, అత్తిలి ఎస్సై పి.ప్రేమరాజ్, కానిస్టేబుళ్లు, యోగాభ్యాసకులు పాల్గొన్నారు.

ఏడుగురు వృద్ధులకు వైద్య సేవలు



వృద్ధుడికి వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యుడు నిమ్మగడ్డ అచ్యుతరామయ్య వృద్ధులకు వైద్య సేవలు అందించారు. తణుకు, సూర్యారావుపాలెం ప్రాంతాల్లో ప్రత్యేక వాహనం ద్వారా పర్యటించి ఏడుగురు వృద్ధులకు వైద్యం చేశారు. సభ్యులు నిమ్మన రామకృష్ణ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్ధి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో తపాల శాఖ సర్వే

పెనుమంట్ర: తపాలాశాఖలో బ్యాంకింగ్ సేవలను ఇండియన్ పోస్టు పేమెంట్ బ్యాంకు ద్వారా మరింత విస్తృత పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ ద్వారా అన్ని సేవలను విస్తృతపరిచేందుకు గ్రామాలలో తపాలాశాఖ సర్వేను ప్రారంభించింది. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించడానికి తపాలాశాఖ ఉన్నతాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సర్వే కోసం తపాలాశాఖ మైసూర్ సాంకేతిక విభాగం ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందించింది. పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం డివిజన్ పోస్టల్ సీనియర్ సూపరింటెండెట్ హరికృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో తణుకు సబ్‌డివిజనల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సూర్యప్రకాష్ ఇప్పటికే సర్వే సిబ్బందికి అవగాహన కల్పించి క్షేత్రస్థాయిలో కచ్చితమైన సర్వే చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి గ్రామంలో ముందుగా సిద్ధ చేసుకున్న 20 కుటుంబాలను ఎంపిక చేసుకుని వివరాలను సర్వే ద్వారా పోస్టల్ సిబ్బంది నమోదు చేస్తారు. ఈ సర్వే నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు.

క్రైస్తవ విశ్వాసుల నిరసన

భీమవరం అర్బన్: గొల్లవానితిప్ప గ్రామంలో ఆర్‌సీఎమ్ చర్చి వద్ద ఫాదర్ గో బ్యాక్ అంటూ క్రైస్తవ విశ్వాసులు ఆదివారం నిరసన తెలిపారు. పలువురు సంఘ పెద్దలు మందా జాన్, మిరిపే విజయకుమార్, ముస్కూటి కుటుంబరావు, తాతపూడి రాంబాబు మాట్లాడుతూ 2021లో ఆర్‌సీఎమ్ చర్చికి ఫాదర్ జోషఫ్, రాజ్‌కుమార్ సేవ చేసేందుకు వచ్చారని అప్పటి నుంచి చర్చి పరిధిలో విచారణ సంఘాలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. గత కొంత కాలంలో చర్చిలో నూతనంగా వివాహం చేసుకున్న వారికి డిక్లరేషన్ ఇవ్వాలని నగదు కూడా అడగి కొత్త నిబంధనలు తీసుకొస్తున్నారన్నారు. అంతేకాకుండా తమపై అన్యాయంగా, అక్రమంగా కేసులు పెట్టారని ఆరోపించారు.

ఎల్లప్ప కాలువ ప్రక్షాళన ఎప్పుడో?



పెనుగొండలో మురికి కూపంగా మారిన ఎల్లప్ప కాలువ

పెనుగొండ: ఎల్లప్ప కాలువ ప్రక్షాళన చేపట్టి ఆదుకోవాలంటూ రైతులు మొరపెట్టుకొంటున్నారు. పంట కాలువ కాస్తా మురికి కాలువగా మారిపోవడంతో కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులు నానా కష్టాలు ఎదుర్కొంటున్నారు. నరసాపురం ప్రధాన కాలువ నుంచి పెనుగొండలో ప్రధాన గ్రామం నుంచి నక్కల డ్రెయిన్ వరకూ ఎల్లప్ప కాలువ ప్రవహిస్తుంది. పెనుగొండ ప్రధాన గ్రామం మధ్య నుంచి ప్రవహించడం ఎల్లప్ప కాలువకు శాపంగా మారింది. గ్రామంలోని మురికి అంతా ఎల్లప్ప కాలువలోకే ప్రవహిస్తుండంతో మురుగుకాలువగా మారింది. దీనికి తోడు ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ కాలువలోకే చేరుతుంది. దీంతో రెండు దశాబ్దాలుగా ప్రక్షాళన కోసం రైతాంగం నీటి పారుదల శాఖాధికారులకు, ప్రజా ప్రతినిధులకు పదేపదే విజ్ఞప్తి చేస్తూ మొర పెట్టుకుంటున్నారు. పదేళ్ల క్రితం ఆధునికీకరణ పనులు చేపట్టినా సగంలోనే నిలిపివేశారు. దీంతో ఎల్లప్ప కాలువ ప్రక్షాళన కలగానే మిగిలిపోయింది. దీంతో ఎల్లప్ప కాలువ మురికి కాలువగానే ఉండిపోయింది. సాగు మొదలవుతున్న తరుణంలో కాలువను ఇప్పటికైనా ప్రక్షాళన చేయాలని కోరతున్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం సాగేదెలా?



మడుగు పోలవరంలో గోతుల మయంగా ఉన్న రహదారి



తోలేరులో అధ్వానంగా ఉన్న రహదారి

- గోతులమయంగా తోలేరు, మడుగు పోలవరం రోడ్లు
- అవస్థలు పడుతున్న గ్రామస్తులు, వాహనదారులు

వీరవాసరం: అధికారంలోకి రాగానే రహదారులకు మహర్దశ ఏర్పడుతుందని కూటమి నాయకులు పెద్ద ఎత్తున ప్రచార ఆర్భాటం చేశారు. ఆ మాయ మాటలు నమ్మి ప్రజలంతా కూటమికి అధికారాన్ని అప్పజెప్పారు. తీరా అధికారం చేజిక్కించుకున్నాక రహదారులకు మహర్దశ మాట దేవుడెరుగు కనీసం గుంతలు పూడ్చే కార్యక్రమం కూడా చేపట్టలేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొణితివాడ గ్రామం నుంచి మడుగు పోలవరం మీదుగా నెలమూరు వెళ్లే రహదారి పూర్తిగా గోతులమయంగా తయారైంది. అదే మాదిరిగా తోలేరు చింత నుంచి తోలేరు- పడమటిపాలెం వెళ్లే రహదారి సైతం పెద్దపెద్ద గుంటలతో కొద్దిపాటి వర్షానికి నీళ్లతో మునిగిపోతుంది. నౌడూరు జంక్షన్ నుంచి అండలూరు మీదుగా వేండ్ర వెళ్లే రహదారి సైతం పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారులపై ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఇంతవరకు గోతుల్లో కనీసం తట్ట మట్టి వేసిన దాఖలాలు లేవని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహన చోదకులు, ప్రయాణికులు రహదారిపై ఏర్పడిన పెద్దపెద్ద గుంతల్లో పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. వర్షాలు పడిన సమయంలో అయితే మరీ ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గుంతల్లో నీరు నిండి రహదారి పరిస్థితి తెలియక ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఈ రహదారులను పునర్నిర్మించాలని కోరుతున్నారు.

గోతులను పూడ్చాలి



కూటమి ప్రభుత్వం రహదారి నిర్మాణాలపై పూర్తిస్థాయిలో శ్రద్ధ వహించడం లేదు. ఏ రోడ్డు చూసినా గోతులమయంగానే మారిపోయింది. కొణితివాడ నుంచి మడుగు పోలవరం వెళ్లాలంటేనే భయానక వాతావరణం కనిపిస్తోంది. కొద్దిపాటి వర్షానికి నీళ్ల నిండి రహదారి చెరువులను తలపిస్తుంది. రహదారి నిర్మాణంపై ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం గోతులైన పూడ్చితే బాగుంటుంది.

– కాండ్రేగుల శ్రీనివాసు, నరసన్నచెరువుపాలెం

యువత క్రీడల్లోనూ రాణించాలి

భీమవరం అర్బన్: యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు అన్నారు. మండలంలోని చినఅమిరంలో గత 10 రోజులుగా జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ విజయ నరసింహారాజు మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా చినఅమిరం యూత్‌ను అభినందించారు.